క్లుప్తంగా

ముగిసిన 'కంటివెలుగు'

బోథ్: మండలంలో కంటివెలుగు కార్యక్రమం గురువారం ముగిసింది. కౌఠ(బి) గ్రామంలో వైద్యాధికారి నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో దాదాపు 24 వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 5585 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. సర్పంచ్ రాధిక గంగాధర్, ఉప సర్పంచ్ రవి, పంచాయతీ కార్యదర్శి వినోద్, సూపర్‌వైజర్స్ భారత, లక్ష్మి, జుహీదా, వీణసాగర్, రాజేందర్ రెడ్డి, అప్తాల్మిక్ భాస్కర్, రాజు, చంద్రకళ, ఆశ పాల్గొన్నారు.

పరామర్శ

ఇచ్చోడ: మండలంలోని సిరిచేల్మలో మండల ఆదివాసీ నాయికపోడ్ ప్రధాన కార్యదర్శి బైరి చిన్నయ్య తండ్రి బైరి భీమన్న మరణించారు. దీంతో గురువారం బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరత్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు లింగాల సంతోశ్‌గౌడ్ పెద్దమ్మ లింగాల గీతవ్వ మృతి చెందారు. ఈ విషయాన్ని కార్యకర్తల ద్వారా తెలుసుకున్న బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ గురువారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

'ప్రొటోకాల్ పాటించని ఎమ్మెల్యే'

బజార్‌హత్నూర్: మండలంలోని గంగాపూర్ గ్రామం సమీపంలో కల్వర్టు నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భూమిపూజ చేసిన కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీటీసీ, సర్పంచ్‌ను ఆహ్వానించకుండా అవమానించాడని గిర్నూర్ ఎంపీటీసీ సోన్వాకే గజానంద్ మండిపడ్డారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే బోథ్ మండలంలో ఒక్క అభివృద్ధి పని చేయలేదని కొబ్బరికాయలు కొట్టి ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడే శ్రీరాం, శివరాజ్, అజయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

ఉట్నూర్‌రూరల్: పల్లెపల్లెకూ రేఖక్క కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని సాలెవాడ(బి) గ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం పలు గ్రామాల్లో నిర్వహించిన పెళ్లి వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అజీమొద్దీన్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఢిల్లీ ప్రతినిధి అనిల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో యువతకు అవగాహన కల్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి కేంద్రం నిర్వాహకురాలు రేవతి బహెన్, హిమాన్షు పాల్గొన్నారు.

అంబేద్కర్ మనుమడు జిల్లాకు రావడం ప్రజల అదృష్టం

ఆదిలాబాద్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మనుమడు ప్రకాష్ అంబేద్కర్ ఈనెల 6న ఆదిలాబాద్‌కు రావడం ప్రజల అదృష్టమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. గురువారం దుర్గం ట్రస్ట్ కార్యాలయంలో మాట్లాడారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున జిల్లా ప్రజలు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్, రాహుల్ దాండ్గే, బోర్లకుంట దీపక్, రత్నాజడే ప్రజ్ఞకుమార్, గంగారాం బోరేకర్ పాల్గొన్నారు.

'ఎంపీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి'

ఎదులాపురం: అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ధిక్కరించడం ఎంపీ సోయం బాపురావుకు తగదని, ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. ఆదివాసీలను మతమార్పిడులకు ప్రేరేపించే వారి గుండెల్లో బుల్లెట్లు దింపుతానంటూ ఎంపీ సోయం బాబురావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నాయకులు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న, మంజుల పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత అన్నిరంగాల్లో రాణించాలని దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణం దుర్గం ట్రస్ట్ కార్యాలయంలో సుభాష్‌నగర్ కాలనీ చెందిన పవార్ నితీన్ అనే యువకుడు నిర్వహిస్తోన్న యూట్యూబ్ ఛానల్‌లో 'ఆర్ఎస్ 38 ర్యాపర్–జిందగీ' అనే పాటను గురువారం ప్రారంభించారు. రంగినేని శ్రీనివాస్‌రావు, రాహుల్ దాడే, వికాస్, ప్రదీప్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పూర్తయ్యేదెప్పుడో?

- బేల విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ లైన్
- మూడు నెలలుగా నిలిచిన పనులు



లక్ష్మీపూర్ శివారులో వేసిన విద్యుత్ స్తంభాలు

బేల: ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి జైనథ్ మార్గంలో బేల విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు పాత 33 కేవీ లైన్ సమస్యలను పరిష్కరించేందుకు రెండేళ్ల క్రితం ప్రత్యేక బేల 33 కేవీ లైన్ మంజూరైంది. ఈక్రమంలో టెండర్లు పూర్తయి రూ.2కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. కాగా ఈ పనులన్నీ ఇప్పటికే పూర్తికావాల్సి ఉంది. కానీ ఇంకా పూర్తి కాకపోగా, గత మూడు నెలల నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు మాత్రం దృష్టి సారించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తయితే బేల మండలానికి విద్యుత్ అంతరాయ సమస్యలు తీరనున్నాయి.

పెరిగిన విద్యుత్ వినియోగం..

గతంలో జిల్లా కేంద్రం నుంచి 33 కేవీ లైన్‌తో జైనథ్, బేల మండల కేంద్రాల్లో ఒక్కొక్క విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండేవి. గత 15ఏళ్ల నుంచి విద్యుత్ వినియోగం పెరగడంతో సబ్‌స్టేషన్లు ఒక్కొక్కటిగా పెరిగాయి. జైనథ్ మండలంలో పెండల్‌వాడ, గిమ్మ, ఆనంద్‌పూర్, దీపాయిగూడ గ్రామాల్లో కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటయ్యాయి. దీంతో పాటు బేల మండలంలో చప్రాల, సాంగిడి గ్రామాల శివారుల్లో సబ్‌స్టేషన్లు నిర్మించారు. పెరిగిన వ్యవసాయ, గృహ, గృహేతర విద్యుత్ వినియోగంతో విద్యుత్ సమస్యలు ఏర్పడ్డాయి. విద్యుత్ అంతరాయ సమస్యల పరిష్కారం కోసం బేల, చప్రాల, సాంగిడి సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక 33కేవీ లైన్‌ను అప్పటి అధికారులు మంజూరు చేశారు. ఈ లైన్‌ను జిల్లా కేంద్రం నుంచి లక్ష్మీపూర్(జైనథ్) వరకు 19 కిలోమీటర్లు చేపట్టారు. లక్ష్మీపూర్ శివారులోని జంక్షన్‌లో దీన్ని పాత లైన్‌కు కలుపనున్నారు.

రూ.2 కోట్లతో పనులు..

జిల్లా కేంద్రంలోని సీసీఐ సమీపంలోని 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బేల సబ్‌స్టేషన్ కోసం రూ.2కోట్లతో ఏడాదిన్నర క్రితం నుంచి 33కేవీ లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా లాండసాంగ్వి గ్రామ శివారులో పెన్‌గంగ కెనాల్ మార్గంలో లక్ష్మీపూర్ (జైనథ్) వరకు పనులు చేపట్టారు. మొత్తంగా 19 కిలోమీటర్లు ప్రతీ 50 మీటర్లకు ఒక్కొక్క స్తంభం వేయడం, ఆధునాతన సాంకేతికతతో నిర్మాణ పనులు చేపట్టారు. స్తంభాలకు విద్యుత్ తీగలు కూడా ఏర్పాటు చేశారు. వీటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోగా.. స్తంభాలకు కింది భాగంలో కట్టేసి పనులను అర్ధాంతరంగా వదిలేశారు. ఈ విషయమై జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్‌ను వివరణ కోరగా.. పనులపై నిర్మాణ విభాగం నుంచి ఆరా తీశామని, పది రోజుల్లోగా పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ — నిరుపయోగంగా నల్లాలు



తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు నిరుపయోగంగా మారాయి. నీటి కోసం ఏర్పాటు చేసిన సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నల్లా ఏర్పాటు చేసి నీరు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: ప్రశాంత్ ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ, ఫోన్: 63099 54496

'ప్రజా సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే'



బావి నీటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇంద్రవెల్లి: ఖానాపూర్ ఎమ్మెల్యే ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు పెందోర్ ప్రభాకర్, పుర్క బాపురావ్‌లు అన్నారు. గురువారం మండలంలోని మామిడిగూడ గ్రామాన్ని సందర్శించి నీటి సమస్యలపై ఆరా తీశారు. తమ గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదని, మంచి నీటి పథకాలు పని చేయడం లేదని గ్రామస్తులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు రాక గిరిజనులు ఇబ్బంది పడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నీటిసమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జాదవ్ సునీల్, సోమోరే నాగోరావ్, ముఖడే ఉత్తం, గ్రామస్తులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న రాక్రే మహేందర్

ఎదులాపురం: పెయింటర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పెయింటర్స్ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు రాక్రే మహేందర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. నిరుపేద పెయింటర్ కార్మికులు వారి జీవనం కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పని చేస్తున్నారని, అయినా.. ప్రభుత్వం వారిని గుర్తించడం లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, ప్రమాద బీమా, వైద్యం సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉయికే రమేశ్, కోశాధికారి కోవే మారుతి, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



జొన్న కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: రైతులు జొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొన్న, మొక్కజొన్న పంటలను ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, సర్పంచ్ చౌహాన్ సునీత, రాథోడ్ ప్రవీణ్, రాథోడ్ ప్రకాశ్, రమేశ్, జాదవ్ కైలాస్, వ్యవసాయ సహకార సంఘం సీఈవో ఈశ్వర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని బోథ్ మార్కెట్‌యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గురువారం ప్రారంభించారు. రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులను సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాణ్‌సింగ్, సర్పంచ్ సురేందర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, జగన్‌రెడ్డి, ఎలుక రాజు, ప్రవీణ్, రమణ గౌడ్, లోలపు పోశెట్టి, భీమ బుచ్చన్న పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మోహన్‌సింగ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ వనిత

ఇచ్చోడ: జూన్ 2నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతంగా చేయాలని తహసీల్దార్ మోహన్‌సింగ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సమద్, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, ఎంపీవో రమేశ్, ఆర్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

తాంసి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ప్రతీ గ్రామంలో ఘనంగా నిర్వహించాలని తాంసి జెడ్పీటీసీ రాజు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధిని తెలియజేసే విధంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో భూమయ్య, తహసీల్దార్ శ్రీదేవి, ఏవో రవీందర్, ఏఈ చంద్రశేఖర్, సదానంద్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి 22వరకు జరిగే దశాబ్ది ఉత్సవాలను ఆయా మండలాల్లో, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా నిర్వహించాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ కోరారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

ఉట్నూర్‌రూరల్: అన్ని గ్రామపంచాయతీల్లో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. రేపటి నుంచి 22 వరకు ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల, ప్రత్యేకాధికారి మహేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని మావల జెడ్పీటీసీ నల్ల వనిత అన్నారు. మావల మండల కేంద్రంలో కొనసాగుతున్న ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పని చేయలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో అరుణ, పంచాయతీ కార్యదర్శి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ సమద్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన సెంటర్ ఆవరణలో గురువారం జీ20 అవగాహన పోస్టర్‌ను జన శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్యామల ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ.. జీ20 సమావేశాలకు భారతదేశం అధ్యక్షత వహించినందుకు దేశమంతట 15 రోజుల పాటు నిర్వహించే మొక్కల పెంపకం, వివిధ రకాల క్రీడలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోశ్, టైలరింగ్ స్వప్న పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ జీవనోపాధిని ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మేదరి కులస్తులు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందించడాన్ని స్వాగతిస్తు గురువారం ఎమ్మెల్యే జోగు రామన్నను తన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, మేదరి సంఘం నాయకులు ఉరే గణేష్, సూర్య దశరథ్, వినోద్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలో నూతనగా ఎన్నికైన అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులను గురువారం మండల కేంద్రంలోని ప్రబుద్ధనగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షులు సోన్‌కాంబ్లే మనోహర్, ఉపాధ్యక్షుడు పవార్ శివాజీ, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కాంరాజ్, కాంబ్లే సునీల్‌ను సన్మానించి, మిఠాయిలు తినిపించారు. నాయకులు సోమసే వెంకట్‌రావ్, జహీర్, సోన్‌కాంబ్లే జితేందర్, భవాలే సత్యానంద్ పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్: బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. గురువారం మండలంలోని గంగాపూర్ సమీపంలో రూ. 10 లక్షల నిధులతో కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం రాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ గిరిజనులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి 10శాతం రిజర్వేషన్లు పెంచిందని, గిరిజనులకు సేవాలాల్, కుమురం భీం భవనాలను నిర్మించిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కానిందే రాజారాం, నిస్తే కైలాస్, లక్ష్మణ్, రాజేశ్వర్, సాయిచైతన్య, రాజు, కవీందర్, నరేశ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి



జైనథ్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జైనథ్: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ అనిత అన్నారు. గురువారం మండల కేంద్రంలో ష్యూర్ ఎన్‌జీవో సహకారంతో సంపూర్ణ సురక్ష హెచ్ఐవీ ఎయిడ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ సిబ్బంది, ఎన్‌జీవో ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అవగాహనతో ఎయిడ్స్ సోకకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దుమాల దేవన్న, ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, ఎన్‌జీవో ప్రాజెక్ట్ ఆఫీసర్ భాను, సూపర్‌వైజర్ వేణు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన ఉండాలని డీపీసీయూ ఎంఈ సతీశ్ అన్నారు. గురువారం మండలంలోని చాందా (టి) గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సాధారణ ప్రజలలో హైరిస్క్ గ్రూపులలో హెచ్ఐవి అవగాహన, పరీక్షలను పెంచడానికి రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దారట్ల భాస్కర్, పంచాయతీ కార్యదర్శి రాఖీ, ఐసీటీసీ కౌన్సిలర్ మెహరాజ్, ఎల్‌టీ ప్రసాద్, గంగామణి, భువన, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈనెల 6న నిర్వహించే భారీ బహిరంగ సభను ఆదివాసీలు విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు, షెడ్యూల్, బీసీ, మైనార్టీ కులాలు, బహుజనులు, అంబేద్కర్ వాదులు తరలిరావాలన్నారు. తుడుం దెబ్బ జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఉయిక ఇందిరా, సలాం వరుణ్, ఆత్రం గణపతి, ఆత్రం భుజంగ్‌రావ్, దుర్వ లింగు, గేడం రమేశ్ పాల్గొన్నారు.

కానరాని 'పల్లెవెలుగు'

- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న 30 గ్రామాల ప్రజలు
- ప్రమాదకరంగా ప్రయాణం
- పట్టించుకోని అధికారులు



ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న చిన్నారులు

బోథ్: భారతదేశం అన్ని రంగాల్లో ముందుంది, టెక్నాలజీ అభివృద్ధి చెందిందని గొప్పగా చెప్పుకోవడమే గానీ గ్రామస్థాయిలో మాత్రం అభివృద్ధి కనిపించడం లేదు. ఇప్పటికీ బస్సులు రాని గ్రామాలు కూడా ఉన్నాయి. బోథ్ మండలంలో అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. రోడ్డున్నా.. గ్రామాలకు బస్సులు రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బోథ్ నుంచి పొచ్చర, కనుగుట్ట, కౌఠ, సాకెర, సొనాల, నాగాపూర్, ఘన్‌పూర్, ధన్నూర్, కుచులాపూర్ గ్రామాలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది.

రోడ్డున్నా బస్సు సౌకర్యం సున్నా..

మండలంలోని కుచులాపూర్ మీదుగా ధన్నూర్ వరకు మాత్రమే బస్సు వెళ్తుంది. ఆ రూట్‌లో ఉన్న ధన్నూర్ (కె), బిర్లగొంది, మందబొగడ, కుచ్చిర్యాల్, ఖండిపల్లె, అందూర్, రఘునాథ్‌పూర్, నారాయణపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. నేరుగా రఘునాథ్‌పూర్, నారాయణపూర్ గ్రామాలకు రోడ్డున్నా.. బస్సు మాత్రం వెళ్లడం లేదు. మరో వైపు మర్లపెల్లి గ్రామం వైపు దాదాపు 19 గ్రామాలున్నాయి. బోథ్ నుంచి మర్లపెల్లి మీదుగా నిగిని వరకు అప్పట్లో బస్సు నడిచేది. కానీ ప్రస్తుతం వెళ్లడం లేదు. సొనాల నుంచి చింతలబోరి మీదుగా వజ్జర్ వరకు పది గ్రామాలున్నాయి. కానీ బస్సు సర్వీస్ లేకపోవడంతో ఆటోల్లో జీపుల్లో ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు..

దాదాపు 30 గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల కేంద్రానికి వచ్చి చదువుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఆటోల్లో, జీపుల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణ ఖర్చులు కూడా భారీగా అవుతుండడంతో కొంత మంది విద్యార్థులు చదవలేని పరిస్థితి నెలకొంది. బస్సు ఉంటే బస్సుపాస్ ద్వారా తక్కువ ఖర్చులతో మండల కేంద్రానికి వచ్చే అవకాశం ఉంటుంది. బస్సును ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



రోడ్డున్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి. బస్సు లేకపోవడంతో ఎక్కువ ఛార్జీలతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా విద్యార్థులకు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణం కూడా ప్రమాదకరంగా మారింది.

– విజయ్, సర్పంచ్, నక్కలవాడ

'దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలు'

ఆదిలాబాద్‌టౌన్: కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడం సాయికుమార్ ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో పీడీఎస్‌యూ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు మడవి రవి, కొరెంగ సాయి, కార్తీక్, సునీల్, విక్షిత్, అష్రఫ్, నరేశ్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు శుక్రవారం నేరడిగొండ మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ ఒక ప్రకటనలో తెలిపారు. దర్బాతండా, లఖంపూర్ గ్రామపంచాయతీల భవన నిర్మాణాలకు భూమిపూజ చేస్తారని, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.